క్లుప్తంగా

నేడు నూకతోటి రాజేష్..

నాగలాపురం: మండలంలో వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు టి.అపరంజిరాజు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎస్ఎస్ పురం, వెళ్లూరు గ్రామ పంచాయతీలలో ప్రతి గడప గడపకు వెళ్లి ప్రచారం చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయవలసినదిగా కోరారు.

ముక్కంటి సేవలో సతీష్‌రెడ్డి


ఆలయ ధ్వజస్తంభం వద్ద సతీష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం డీఆర్‌డీవో డీఆర్ జి.సతీష్‌రెడ్డి దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

చిల్లకూరు: తూర్పుకనుపూరులో శుక్రవారం ముత్యాలమ్మ జాతరలో అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్లే క్యూ వద్ద ఏర్పడిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యులను అమ్మవారి దర్శనానికి తీసుకువెళుతుండగా క్యూ వద్ద కోటకు చెందిన వారితో వాగ్వాదం జరిగింది. కొంతమంది అక్కడికి చేరుకుని వారికి సర్దిచెప్పారు. కోటకు చెందిన వ్యక్తిపై దాడి చేసినట్లు తెలుసుకున్న కొంత మంది అమ్మవారి ఆలయం వద్దకు వచ్చి తూర్పుకనుపూరుకు చెందిన శివకుమార్‌పై దాడికి దిగారు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తీసుకెళ్లారు.

మహిళ ఆత్మహత్య

చిల్లకూరు: జాతరకు వెళ్లేందుకు భర్త నిరాకరించడంతో మనస్తాపం చెందిన మహిళ గురువారం రాత్రి విషపు గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. పారిచెర్లవారిపాళెం గ్రామం గిరిజన కాలనీలో యాటగిరి పోలయ్య, రావమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. తూర్పుకనుపూరులో జరిగే ముత్యాలమ్మ జాతరకు పోదామని రావమ్మ భర్తను కోరింది. అందుకు అతను నిరాకరించాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె తన భర్త బయటకు వెళ్లగానే ఇంటిలో ఉన్న విషపు గుళికలు తినింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను చుట్టుపక్కల వారు 108 ద్వారా గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు

- తరలివచ్చిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. వేకువ జామున ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారి గర్భాలయాన్ని మామిడి, వేపాకు, పూలతోరణాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో రాహుకాల సమయం10:30 నుంచి 12 గంటల మధ్యలో రాహుకాల అభిషేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఉపవాసదీక్షలతో వచ్చి అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉభయదారులకు చైర్మన్, ఈఓ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయం వద్ద దాదాపు వెయ్యిమంది భక్తులు ఉచిత అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్, ఈఓ చంద్రమౌళి భక్తులకు వడ్డించారు. ఉచిత అన్న ప్రసాద కేంద్రం నిర్వహణకు దాతలు సహకరించాలని చైర్మన్ కోరారు.

అన్నమయ్యకు అభిషేకం



తిరుమల లేపాక్షి సర్కిల్లో ఉన్న అన్నమయ్య విగ్రహానికి గంధం తదితర సుగంధ ద్రవ్యాలతో శుక్రవారం అభిషేకం నిర్వహించారు. తొలి తెలుగు వాగ్గేయకారులు అన్నమాచార్యుల 521వ వర్ధంతి సందర్భంగా ఆయన వంశీయులు తాళ్లపాక భరద్వాజ్, తాళ్లపాక హయగ్రీవ నారాయణాచార్యులు, రాఘవ, కంచి రాజేష్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

పేదల ఆశాజ్యోతిని మరోసారి గెలిపించండి

- టీడీపీకి ఓటు వేస్తే మళ్లీ కష్టాలే
- ఎన్నికల ప్రచారంలో ఎంపీ గురుమూర్తి, నూకతోటి రాజేష్


చిన్న పాండూరు వడ్డిపాళెంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్


వీకేఆర్‌పై గిరిజనకాలనీలో జరిగిన ఎన్నికల ప్రచారంలో నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: పేదల ఆశాజ్యోతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎంపీ మద్దెల గురుమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని రాచర్ల, అరుంధతివాడ చిన్న పాండూరు, జంగంపాళెం, వీకేఆర్‌పై గిరిజనకాలనీ, వడ్డిపాళెం, పాదిరికుప్పం, రామలక్ష్మమ్మకండ్రిగ, అరుదూరు గ్రామాల్లో ఎంపీతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీరికి నేతలు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజలు తప్పకుండా జగనన్న ప్రభుత్వానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు తమ ఓటుతో బుద్ధి చెబుతామని అవ్వాతాతలు తెలిపారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా అమలు చేయని సంక్షేమ ఫలాలను అందించిన ప్రభుత్వం మళ్లీ కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకుల మాయమాటలు నమ్మి, ఆ పార్టీకి ఓటు వేస్తే కష్టాలు కొనితెచ్చుకున్నట్లు అవుతుందని తెలిపారు. వలంటీర్ వ్యవస్థను తొలగించడం తాత్కాలికమేనని, జూన్ 4 తర్వాత ఏర్పాటుకానున్న జగనన్న ప్రభుత్వంలో తొలి సంతకం వలంటీర్ వ్యవస్థను కొనసాగించేందుకు పెట్టనున్నారని తెలిపారు. తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకులు బీరేంద్ర వర్మ, మండల పార్టీ కన్వీనర్ దయాకర్ రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్ బాబు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, ఎంపీటీసీ భువనేశ్వరి, నియోజకవర్గ యూత్ కార్యదర్శి మహేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యుడు బందిల సురేష్, సర్పంచులు శ్యామల, శ్రీధర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు మాధవయ్య, గిరిప్రసాద్, నేతలు సూరజ్ ఆనంద్, భూషణం, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, నియోజకవర్గ సోషల్ మీడియా కో–కన్వీనర్ శోభన్ యాదవ్ పాల్గొన్నారు.

పాండురంగ స్వామికి విశేష పూజలు


తాటి చెట్టును అధిష్టిస్తున్న భక్తులు

- శనివారం పండరి భజన గజపూజకు ఏర్పాట్లు


తాటిచెట్టుకు పసుపు, కుంకుమ దిద్దుతున్న మహిళలు

పిచ్చాటూరు: పిచ్చాటూరులో పాండురంగ స్వామికి భక్తులు శుక్రవారం సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. పిచ్చాటూరులో 14 ఏళ్ల లోపు చిన్నారులు మూడు నెలలుగా స్థానిక ధర్మరాజు ఆలయం వద్ద పండరి భజనను అభ్యసిస్తున్నారు. వారి అభ్యసన పూర్తికావడంతో శనివారం గజపూజ జరగనుంది. ఏర్పాట్లలో భాగంగా భక్తులు తాటిమానును అధిష్టించారు. సాయంత్రం పాండురంగ స్వామి చిత్రపటాన్ని ఉంచి విశేష పూజలు చేశారు. రాత్రి చిన్నారుల పండరి భజన అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యుద్దీపాలంకరణ, అరటి, మామిడి తోరణాలు, రంగవల్లులు, రంగుల కాగిత తోరణాలతో ఆలయ ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దారు. శనివారం చిన్నారుల కాళ్లకు గజ్జలు కట్టి రాత్రంతా పండరి భజన ద్వారా స్వామి, అమ్మవారి సేవలో తరిస్తారని నిర్వాహకులు తెలిపారు.

పట్టుదలతో చదివితే లక్ష్య సాధన





శ్రీకాళహస్తి: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే దానిని సాధించవచ్చని హెచ్ఎం ఎస్. జబీర్‌బాషా అన్నారు. మండలంలోని ఇనగలూరు పాఠశాలలో వార్షికోత్సవం, ఎనిమిదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు షరీఫ్, వసంత, సబిత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతి


జగజ్జీవన్‌రామ్ చిత్రపటం ముందు నివాళులు అర్పిస్తున్న స్కౌట్ విద్యార్థులు




రేణిగుంట: దిగుల మల్లవరంలో.., బుచ్చినాయుడుకండ్రిగలో నేతల నివాళి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని సరస్వతి బాయి పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో శుక్రవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూత్ చైర్మన్ అజారుద్దీన్, స్కౌట్ మాస్టర్లు ధనుష్, లీడర్లు విశ్వ, ముగ్ధశ్రీ, ఉపాధ్యాయులు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

రేణిగుంట మండలంలో..

రేణిగుంట: మండలంలోని దిగువ మల్లవరంలో ఆకాంక్ష సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి మర్దాల రవిబాబు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను స్మరించారు. సంస్థ అధ్యక్షురాలు భారతి, మస్తాన్, అమరావతి, రాఘవులు, ప్రియాంక, దీప్తి, భానుశ్రీ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక బస్టాండు ఆవరణలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మల రాఘవయ్య ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఎమ్మార్పీఎస్ నేతలు పండయ్య, కిరణ్‌కుమార్, రమేష్‌కుమార్, సుదర్శన్, రాఘవేంద్ర, నాగరాజు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.







వేసవి ఉపశమనం

ఎండలకు తట్టుకోలేక యువత బావులు, నీటి గుంటలు, చెరువుల బాట పడుతున్నారు. బావులు, గుంటలు, చెరువుల్లో ఈత కొడుతూ ఎండల నుంచి ఉపశమనం పొందుతున్నారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేట, తుమ్మూరు వద్ద వేసవి తాపానికి తాళలేక కొందరు యువకులు చెరువులో ఈత కొడుతూ సరదాగా కేరింతలు కొడుతున్న దృశ్యాలు సాక్షి కెమెరా బంధించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి


ఆర్.మల్లవరంలో ప్రచారం చేస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

- ఎన్నికల ప్రచారంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి


బియ్యపు శ్రీవాణిరెడ్డికి కర్పూర హారతి ఇస్తున్న మహిళ

రేణిగుంట: శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని మూడు దశాబ్దాల పాటు పాలించిన బొజ్జల కుటుంబం ప్రజలకు చేసిందేమీ లేదని, తన భర్త గెలిచి అభివృద్ధి అంటే ఏమిటో నాలుగున్నరేళ్లలో చేతల్లో చూపించారని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి అభ్యర్థించారు. మండలంలోని ఆర్.మల్లవరం పంచాయతీ డీపీ కండ్రిగ, ఆర్.మల్లవరం, ఎస్టీ కాలనీ, కుమ్మరపల్లె, దళితవాడ, సుబ్బయ్యగుంట, ఎస్సీ కాలనీ, తుమ్మలగుంట ఎస్టీ కాలనీలలో శుక్రవారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత గ్రామ సర్పంచ్ ఆవుల మునివెంకట్రామిరెడ్డి(బాబ్జి) ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతర ఆమె ఇంటింటికీ వెళ్లి కరపత్ర ప్రచారం చేశారు. నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఓటర్లకు వివరించారు. కరోనా కష్టకాలంలో ఎమ్మెల్యే ప్రాణాలను సైతం పణంగా పెట్టి నియోజకవర్గ ప్రజలకు అన్నీ తానై సేవ చేశారని గుర్తు చేశారు. అంతేకాకుండా ఎప్పుడు, ఏ సమయంలో ఎవరికి ఏ కష్టమొచ్చినా కుటుంబ సభ్యుడిలా ఆదుకుంటున్నారని చెప్పారు. కరోనా విపత్తు కాలంలో పక్కరాష్ట్రాల్లో దాక్కున్న వారంతా ఇప్పుడు ఎన్నికలకు రెండు నెలలు ముందు వచ్చి మోసపూరిత మాటలతో ప్రజలను మరోసారి మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి మరోసారి తన భర్తను గెలిపించాలని కోరారు. ఈ పాలనలో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ అండగా నిలిచి మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటే పేదల సంక్షేమం మరింత అద్భుతంగా కొనసాగుతుందన్నారు. టీడీపీ కూటమి వస్తే పేదల సంక్షేమం ఆగిపోయి పెత్తందార్ల పాలన వస్తుందన్నారు. ప్రచారంలో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, తొట్టంబేడు ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, జువ్వల దయాకర్‌రెడ్డి, సర్పంచ్ ఆవుల మునివెంకట్రామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బంగారమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, రైతు సలహా మండలి నియోజకవర్గ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, హరి పురుషోత్తంరెడ్డి, మహదేవరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, సత్యనారాయణ, వెంకటనారాయణ, రామ్మూర్తి, మునస్వామి, ఈశ్వర్, వెంకటరెడ్డి, శ్రీహరి, వెంకటరెడ్డి, మస్తాన్, శేషారెడ్డి, మోహన్‌రామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నగేషం,జాన్‌బాబు, నాగరాజు, రవీంద్ర, తులసి, సుధారాణి, జయంతి, జ్యోతి, అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు కుక్కలదొడ్డి, మామండూరులో ప్రచారం

మండలంలోని కుక్కలదొడ్డి, మామండూరులో శనివారం సాయంత్రం బియ్యపు శ్రీవాణిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంగారి రమేష్ తెలిపారు.

ముస్లిం మైనారిటీలకు ప్రభుత్వం అండ


ముస్లింలకు స్వీట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి, అంజూరు

శ్రీకాళహస్తి: రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలకు జగన్ ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్సీ, రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం తెలిపారు. రంజాన్ పర్వదినం పురస్కరించుకుని పట్టణంలోని ముస్లింలకు శుక్రవారం ఆయన స్వీట్లు అందజేసి ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నియోజవర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి చేస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు జనార్ధన్ రావు పవార్, కంతా ఉదయ్, రత్నంరెడ్డి, కిట్టుమేస్త్రీ, వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి, పఠాన్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

చిందేస్తాం..కూటమిని చిదిమేస్తాం..!




మండిపేట, జే అగ్రహారంలో ప్రచారం రథం ముందు నృత్యం చేస్తున్న మహిళలు

బలిరా బలి బలిరా...
జెండాలు జతకట్టడమే మీ అజెండా
జనం గుండెల్లో గుడి కట్టడమే జగన్ అజెండా
బలిరా బలి బలిరా..

అనే పాట వైఎస్సార్‌సీపీ ప్రచార రథంలో వినిపిస్తే చాలు ప్రజలకు తెగ హుషారొచ్చేస్తోంది. పలమనేరు నియోజకవర్గంలోని పల్లెల్లో మహిళలు, పంట చేలల్లో కూలి పనులు మహిళా కూలీలు ప్రచార రథంలో ఈ పాట విని అక్కడికి చేరుకుని ఉత్సాహంతో నృత్యం చేస్తున్నారు. జగన్‌పై తమకున్న అంతులేని అభిమానాన్ని చాటుతున్నారు. నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లె మండలం చప్పిడిపల్లె పంచాయతీ జంగాళ అగ్రహారం, పలమనేరు మండలంలోని మండిపేటలో శుక్రవారం ఈ పాటను విని మహిళలు చిందేసిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ పాట తమకు రెట్టింపు ఉత్సాహం ఇస్తోందని, ఎన్ని కూటములొచ్చినా తామంతా మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటామని మహిళలు చెప్పారు.

- పలమనేరు

పెద్ద శేషునిపై శ్రీకోదండరాముని వైభవం


పెద్దశేష వాహనంపై ఊరేగుతున్న శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజైన శుక్రవారం రాత్రి పెద్దశేష వాహనంపై శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి అధిరోహించి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. గజరాజులు ముందు కదులుతుండగా, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు పలికి స్వామివారిని దర్శించుకున్నారు. తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, డెప్యూటీ ఈవోలు గోవిందరాజన్, నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.


స్వామివారి వాహనసేవలో కళాకారుల ప్రదర్శన